క్లుప్తంగా

గైనకాలజిస్టు నియామకం


డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ కేంద్రంలో గైనకాలజిస్టుగా డాక్టర్ కల్పన గురువారం విధుల్లో చేరారు. గతంలో పత్తికొండలో పనిచేస్తున్న కల్పన కొన్ని నెలల క్రిందట డిప్యుటేషన్‌పై ఆలూరు వెళ్లారు. నాటి నుంచి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్‌లకు బ్రేక్ పడింది. ఇటీవల జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేయగా గైనకాలజిస్టు లేక గర్భిణులు, బాలింతల ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నారు. వారి చొరవతో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ కల్పనను తిరిగి పత్తికొండకు నియమించారు.

సీఎం సభను విజయవంతం చేయండి

మద్దికెర: వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమానికి సంబంధించి ఈనెల 30వ తేదీన పత్తికొండలో నిర్వహించే సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి సభలో మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగరాజు, ఏఓ హేమలత పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదాతలను ఆదుకునేందుకు అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి పెట్టుబడి సాయాన్ని రైతల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. సభకు తరలివచ్చే రైతులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి

హొళగుంద: మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన మంజునాథ్ (25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న మంజునాథ్ ఈ నెల 2న నొప్పి తీవ్రతను తట్టుకోలేక విరక్తి చెంది పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బళ్లారి ఓపీడీ ఆస్పత్రిలో చేర్పించగా కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు. మృతుడి తండ్రి హనుమంతప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఎమ్మిగనూరులో జూన్ 11వ తేదీన బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ గర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు రామలింగయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఐనకల్లు గ్రామంలో బీసీ గర్జన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆ పార్టీ నాయకులు కొమ్ము రమేష్, రంగస్వామి పాల్గొన్నారు.

31న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 31న బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసానాయక్ తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించిన ప్రాథమిక, ఇతర సమాచారాన్ని ఆయా శాఖాధికారులు ఈ నెల 27వ తేది నాటికి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కరెక్కృష్ణ


జిల్లా అధ్యక్షుడు కరెక్కృష్ణ


ఉపాధ్యక్షుడు పాటిల్ ఈశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: గుడేకల్ హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరెక్కృష్ణ డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఆరోసారి ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పాటిల్ ఈశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు మండల డీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, సాయిబాబా గురువారం తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన 16వ కౌన్సిల్ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేస్తూ పలు విధాలుగా సేవలందిస్తున్న వారు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికకావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో వారిని డీటీఎఫ్ నాయకులు జయానంద్, జగదీష్, చంద్రశేఖర్ యాదవ్, హసన్ తదితరులు కలిసి అభినందించారు.

చేనుకు బలం.. సాగుకు సంసిద్ధం

- రోహిణి కార్తె ఆగమనంతో వ్యవసాయ పనులు మొదలు
- ఎరువులు తోలుకోవడం.. పొలాలు దుక్కి దున్నుకోవడంలో రైతన్నలు నిమగ్నం
- రుతు పవనాల రాక కోసం ఎదురుచూపులు

తుగ్గలి: రోహిణి కార్తె గురువారం ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ముందుగా నేలను సారవంతం చేసేలా పశువుల ఎరువును ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో తరలించి పొలంలో చల్లుతున్నారు. నైరుతి రుతు పవనాలు కొంచెం అటుఇటుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. జూన్ మొదటి వారంలో వాటి ఆగమనం ప్రారంభమవుతుంది. తొలకరి వర్షాల ప్రారంభానికి ముందే పశువుల ఎరువును పొలంలో కుప్పలు పోసి తర్వాత పొలమంతా చల్లుతారు. కలుపు గడ్డి లేకుండా నాగళ్లు, ట్రిల్లర్లతో నేలను దున్నుతారు. భూమిలో ఏమైనా పంటకు హాని చేసే పురుగులు ఉంటే చనిపోతాయి. ఇక తొలకరి వర్షాలు ప్రారంభమై నేల పదునెక్కగానే భూమిలో విత్తనం విత్తుతారు. ఈ ఏడాది వేసవిలో అకాల వర్షాలు అక్కడక్కడా కురవడంతో ఇప్పటికే పొలాల్లో కలుపు వ్యర్థాలు తొలగించి దుక్కి దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గత నాలుగేళ్లుగా వర్షాలు బాగా కురుస్తుండడం, ఈ ప్రభుత్వం వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం అందించడం, సకాలంలో రుణాలు అందడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిడం, ఆర్‌బీకేల ద్వారా ఉన్న ఊర్లలోనే ఎరువులు, విత్తనాలు, పంట నష్టపోయిన సమయంలో బీమా, పరిహారం, యంత్రసాయం తదితర సేవలందిస్తున్నారు. రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తుండడం వారికి ఊరటనిస్తోంది. ప్రభుత్వ పథకాలతో రైతులకు ఇబ్బందులు చాలా వరకు తప్పడంతో సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 63,220 ఎకరాల్లో రైతులు వేరుశనగ, పత్తి, ఆముదం, మినుము, సజ్జ, జొన్న, టమాట తదితర పంటలు సాగు చేయనున్నారు. 2,600 క్వింటాళ్ల వేరుశనగ, 30 క్వింటాళ్ల కంది విత్తనాలు సబ్సిడీపై అందించనున్నారు. ప్రభుత్వ పథకాలు అండగా నిలుస్తుండడంతో రైతులు సంతోషిస్తున్నారు.


రామాపురంలో పశువుల ఎరువును పొలంలో కుప్పలు పోస్తున్న రైతన్న

కష్టాలు తప్పాయి



గతంలో సబ్సిడీ బుడ్డల కోసం ఎన్నో అవస్థలు పడాల్సి వచ్చేది. మండల కేంద్రానికి వెళ్లి క్యూలైన్లలో పడిగాపులు కాయాలి. బుడ్డల కోసం ధర్నాలు చేసిన సంఘటనలు ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆ కష్టాలన్నీ తప్పాయి. గ్రామాల్లో ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ సంబంధిత సేవలన్నీ ఉన్న ఊర్లోనే అందుతున్నాయి. పెట్టుబడి సాయం, పంటల బీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలవడం సంతోషంగా ఉంది.
– బండ్లపల్లి వెంకటేష్, రైతు, ముక్కెల్ల

రైతులకు ఎలాంటి సమస్య రానివ్వం



రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయం. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని సేవలు అందిస్తాం. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం. ఇప్పటికే వేరుశనగ విత్తనాలు అవసరమైన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రారంభించాం. రైతులు నిశ్చింతగా పంటలు సాగు చేసుకోవచ్చు. – పవన్‌కుమార్, ఏఓ, తుగ్గలి

నేడు తుగ్గలికి ఎమ్మెల్యే రాక

తుగ్గలి: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం ఉదయం తుగ్గలికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. ఈ నెల 30న పత్తికొండలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

కూలీల సంఖ్య పెంచాలి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం పనులకు గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓలు అబ్దుల్ షకూర్, శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం వారు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో దాదాపుగా 6 వేల మంది కూలీలు పనులకు వస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని, కాలువల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేసిన పనులకు సంబంధించి బిల్లులకు ఎప్పటికప్పుడు మస్టర్లను అప్‌లోడ్ చేయించాలని టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం అవుతుండటంతో ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులు పండ్ల తోటల సాగు చేపట్టేలా ప్రోత్సహించడంతో పాటు ప్రభుత్వ రాయితీల కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యత అని సామాజిక పరివర్తన మార్పు సమష్టి బాధ్యత(ఎస్‌బీసీసీ) జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ బంగారమ్మ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో సీడీపీవో సఫరున్నిసా బేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై కన్వర్జేషన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో బాల్యవివాహాలను అరికట్టేందుకు కమిటీని ఏర్పాటు చేసి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, నష్టాలను తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓలతో పాటు గ్రామస్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు కమిటీగా ఎర్పడి బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ మహిళా పోలీసులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల అధికారులు ఎంపీడీఓ కృష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, సీడీపీఓ సఫీరున్నీసా బేగం, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై వాల్‌పోస్టర్లను విడుదల చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని, ఆ వయస్సులోపు వివాహం చేస్తే చట్ట రీత్యా నేరం అని, శిక్ష తప్పదని హెచ్చరించారు.

చక్కెర లోడు లారీ బోల్తా


దేవనబండ సమీపంలో బోల్తా పడిన లారీ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దేవనబండ గ్రామ సమీపంలో గురువారం చక్కెర లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కర్నాటక నుంచి చక్కెర లోడుతో కాళహస్తికి వెళ్తున్న లారీ దేవనబండ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్ నాగేశ్వరరావు, క్లీనర్ రామానాయుడును గ్రామస్తులు సురక్షితంగా బయటకు తీశారు.

మరో రోడ్డు ప్రమాదం

వెల్దుర్తి: స్థానిక అభయాంజనేయ స్వామి సర్కిల్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డు చెక్‌పోస్టు వద్ద హైవే–44పై గురువారం సాయంత్రం లారీ బోల్తా పడింది. గొర్రెల ఎరువు లోడ్‌తో కర్నూలు నుంచి రాయదుర్గం వెళ్తున్న లారీ చెక్‌పోస్టు వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పింది. పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని ఒక పక్కకు పడిపోయింది. లారీ డ్రైవర్‌తోపాటు అందులోని ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు.

వేసవి శిబిరంలో ఇంగ్లిష్‌పై శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటరత్నం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ బోధిస్తూ, ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబడుతూ శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం, అనంతరం 'కథ చెప్పండి' కార్యక్రమ నిర్వహణతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్, చిత్రలేఖనం, నాట్యం, ప్రసంగాలపై శిక్షణ, చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి హరికృష్ణ తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పత్తికొండటౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎస్.రామ్‌కుమార్ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా డ్రాయింగ్ టీచర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో 'పండ్లు–కూరగాయల'పై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాల్లో చిన్నారులు పాల్గొనాలని గ్రంథాలయాధికారి రాంకుమార్ కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

వెల్దుర్తి: పాఠ్య పుస్తకాలతోనే గాకుండా మంచి మంచి కథలు, విజ్ఞాన సంబంధిత పుస్తకాల పఠనంతో మంచి పరిజ్ఞానం లభిస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి కవితాబాయ్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయానికి చేరుకున్న చిన్నారులు, విద్యార్థులకు కథల పుస్తకాలతో పాటు సైన్స్ సంబంధిత, మేధావులు, విజ్ఞానవంతుల చరిత్ర పుస్తకాలను చదివించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహ నాయుడు విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు ఘన వీడ్కోలు



సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) శ్రీనివాసులు (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శ్రీనివాసులు (42) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో గురువారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 2004లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లో పనిచేస్తున్న ఈయన హైదరాబాద్‌లో సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్‌లో భార్యపిల్లలతో కలిసి ఉంటున్నారు. సెలవుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి ఇంటి వద్ద విద్యుత్ మోటార్ రిపేర్ చేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సైనిక సిబ్బంది మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి పత్తికొండ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య శారదమ్మ, కుమార్తె భార్గవి, కుమారుడు శ్రీహరి ఉన్నారు.

ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏపీ ఎన్జీఓ భవన్‌లో విద్యార్థి సంఘ నాయకులతో యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కనీస మౌలిక వసతుల్లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘ జిల్లా కార్యదర్శి శేఖర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్, ఆర్‌పీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అఫ్రిది మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల రూపంలో దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. వీటిని అరికట్టాలని కోరారు. ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- మద్దికెరలో 2 వైఎస్సార్ క్లినిక్‌లు, ఆర్బీకే భవనాలు ప్రారంభం

రాష్ట్రంలో సంక్షేమ పాలన


మద్దికెరలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఏపీలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మద్దికెరలో రూ.60 లక్షలతో నిర్మించిన రెండు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రం భవనాలను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే గాకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయో? లేదో? తెలుసుకోడానికి ప్రజాప్రతినిధులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ధైర్యంగా వెళ్లేలా చేశారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, సలహాదారు ఆంజనేయులు, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, నాయకులు శాంతన్న, సుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే అన్నదాత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. ఏఓ హేమలత, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి ఉన్నారు.

వలంటీర్లకు సన్మానం: గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి వారికి నగదు ప్రోత్సాహకంతో పాటు ఘనంగా సత్కరించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం సేవా మిత్ర అవార్డులు వచ్చిన వలంటీర్లకు సన్మానం చేశారు. ఈఓ శ్రీహరి, నాయకులు రామలింగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

2,675 గృహాల నిర్మాణం పూర్తి


వివరాలు వెల్లడిస్తున్న డీఈ గురుప్రసాద్

తుగ్గలి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇప్పటివరకు పత్తికొండ నియోజకవర్గంలో 2,675 ఇంటి నిర్మాణాలు పూర్తి చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ డీఈ గురుప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా 6,954 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జూన్ నాటికి 3,600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటివరకు 2,675 గృహ నిర్మాణాలు పూర్తయినట్లు వెల్లడించారు. ఆర్‌సీ లెవెల్‌లో 397, ఆర్‌ఎల్ – 533, బీఎల్ – 1436 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలకు రూ.55.76 కోట్లను ప్రభుత్వం లబ్దిదారులకు చెల్లిందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా సకాలంలో ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి


నాగలదిన్నెలో సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో అధికారులు

నందవరం: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మీ, కోఆప్షన్ మెంబర్ షేక్ అహమ్మద్, ఎంపీటీసీ బుగిడి యల్లమ్మ పేర్కొన్నారు. గురువారం నాగలదిన్నె గ్రామంలో సచివాలయం–1, –2 పరిధిలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకులు చేతుల మీదుగా సేవా మిత్ర పురస్కారాలు పొందిన వలంటీర్లను షీల్డ్, శాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందిస్తూ, ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఆర్వో వీరేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


పత్తికొండలో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

పత్తికొండ టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని డీపీఓ నాగరాజునాయుడు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ జీవనశైలి కార్యక్రమంలో భాగంగా పత్తికొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. డీపీవో మాట్లాడుతూ.. 12 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని, ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, నీటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆలూరు: పట్టణ కేంద్రంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఆలూరు మేజర్ గ్రామపంచాయతీ అధికారులు సర్పంచ్ అరుణాదేవి సమక్షంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక పాతబస్టాండు సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. పంచాయతీ సిబ్బంది ఎప్పకప్పుడు చలివేంద్రాన్ని పర్యవేక్షిస్తూ తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

విద్యుత్ తీగలను సరి చేయండి

హొళగుంద: సుళువాయి పరిధిలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే సరి చేయాలని రైతులు కోరుతున్నారు. త్వరలో ఖరీఫ్ సీజన్ మొదలవుతుండడంతో వ్యవసాయ పనులు జోరందుకుంటాయని, అయితే పొలాల్లో హై ఓల్టేజీ తీగలు చేతికి తాకేలా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో రైతులు, కూలీలు అటువైపు తిరిగేందుకు భయాందోళన చెందుతున్నారని వాపోయారు. అదేవిధంగా హొళగుంద పీహెచ్‌సీ, ఆదోని రోడ్డులోని పలు చోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని వర్షాకాలం ప్రారంభానికే ముందే వాటిని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హాలహర్వి: మండలంలోని బిలేహాళ్ గ్రామం నుంచి హొళగుంద రోడ్డు వరకు రూ. 78 లక్షలతో పీఎంజీఎస్‌వై కింద సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించినట్లు పీఆర్ ఏఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనులు పూర్తయితే హొళగుంద –ఆలూరు గ్రామాలకు రాకపోకలకు సులభతరం అవుతుందన్నారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

కృష్ణగిరి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది సమయానికి రావడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారికి ఇదివరకే మెమోలు అందజేశామని, మార్పు రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శులు సక్రమంగా పని చేసినప్పుడే గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి షష్టి పూజలు

మద్దికెర: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురువారం షష్టి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారు దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువుతీరగా అర్చకులు హోమపూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్ పాల్గొన్నారు.

దళారులతో జాగ్రత్త

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్, రేషన్ కార్డు ఇతర సంక్షేమ పథకాల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎంపీడీఓ దాసానాయక్ సూచించారు. గ్రామాలలో కొందరు దళారులు ఆయా పనులు చేయిస్తామని చెప్పి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన వారికి తప్పనిసరిగా పథకాలు వర్తిస్తాయని, ఇందుకోసం నేరుగా ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. దళారుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే సంబంధిత వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక కోఆపరేటివ్ స్టోర్స్ ఆదాయం మరింత పెంచేందుకు కృషి చేయాలని ఇందుకు తమ సహాయసహకారాలు అందిస్తామని జిల్లా కోఆపరేటివ్ శాఖ అధికారి ఆంజినేయులు స్టోర్స్ పాలకవర్గానికి సూచించారు. గురువారం స్థానిక కోఆపరేటివ్ స్టోర్స్ కార్యాలయానికి వచ్చిన ఆయన పలు రికార్డులను పరిశీలించి ఆదాయ వ్యయాల గురించి స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు స్టోర్స్ ద్వారా వచ్చే ఆదాయ నివేదికను చైర్మన్ ఆయనకు అందజేశారు.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఆంజినేయులు →

